క్లుప్తంగా

'స్పందన'లో నాలుగు అర్జీలు

కంచికచర్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజల నుంచి నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. ఇళ్లు మంజూరు చేయాలని రెండు, డ్రెయినేజీలో పూడికతీత పనులు చేపట్టాలని ఒకటి, పట్టాదార్ పాసు పుస్తకం మంజూరు చేయాలని మరో అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే బాలశంకరరావు, హౌసింగ్ ఏఈ ఏ నరసింహారావు, పీఆర్ ఏఈ టీవీ రవికుమార్, ఏపీఓం కోట భాస్కరరావు, ఎంఈఓ ఎల్.చిట్టిబాబు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ కల్యాణ మండపానికి రూ.37 లక్షల వితరణ

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో మార్గం సుగమమం అయింది. టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి టీటీడీ దేవస్థానం నుంచి ఇప్పటికే రూ 2.50 కోట్లు మంజూరయ్యాయి. వాటికి పబ్లిక్ కాంట్రిబ్యూషన్ నిమిత్తం రూ.37 లక్షల సహాయాన్ని స్థానిక రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యం మంగళవారం అందజేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కల్యాణ మండపం నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరు చెక్కును ఎమ్మెల్యే ఉదయభానుకు అందజేయనున్నారని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కంచికచర్ల: లంచాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుండగా మరో పక్క సామాజిక న్యాయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎమ్మెల్సీల స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ షేక్ మలక్‌బషర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. ఎమ్మెల్సీలుగా 18మందిని ఎంపికచేస్తే 14మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్థానం కల్పించిన ఏకైక సీఎం జగన్ అని పేర్కొన్నారు. ఒక్కో సామాజిక వర్గానికి ఒక సీటు ఇచ్చారన్నారు. ప్రభుత్వం చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకు తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలో ఇంత గొప్ప మార్పు ఎప్పుడూ జరగలేదని నాయకులు తెలిపారు.

ఆకట్టుకున్న కళాజాత



నందిగామ: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై మండలంలోని కొనతామాత్మకూరులో సోమవారం ప్రత్యేక కళాజాత నిర్వహించారు. కళాకారులు సహకార బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ నేరాలు, నగదు రహిత లావాదేవీలు తదితర అంశాలపై కళాకారులు నాటకాల రూపంలో రైతులకు అవగాహన కల్పించారు.

పాఠశాల తలుపులు పగలగొట్టిన ఆకతాయిలు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలంలోని మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిలు తొమ్మిదవ తరగతి గది తలుపు, కిటికీలు పగలగొట్టారు. పాఠశాలకు శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఆకతాయిలు పాఠశాలలో చొరబడి బీభత్సం సృష్టించారు. సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పగిలిన డోర్లు, కిటికీలు చూసి హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చారు. పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివక్ష లేని సమాజ స్థాపనే లక్ష్యం : జడ్జి దుర్గాకల్యాణి



నూజివీడు: చట్టపరంగా ఎలాంటి వివక్ష, తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమన్యాయం చేయాలన్నదే సామాజిక న్యాయ దినోత్సవం ముఖ్యోద్దేశమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.దుర్గాకల్యాణి అన్నారు. నూజివీడు మండలం యనమదల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయవాది నండూరి పద్మాంజలి, హైస్కూల్ హెచ్‌ఎం జి.విజయకుమారి పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి తక్కువ, ఆదాయం అధికంగా ఉండడంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం రెండేళ్లుగా పెరిగింది. ఈ ఏడాది నియోజకవర్గం మొత్తం మీద ఆరు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.



వత్సవాయి మండలం మొక్కపేటలో సాగు చేసిన మొక్కజొన్న

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట నియోజకవర్గంలో గతంలో పత్తి సాగు చేసిన రైతులు కోతలు పూర్తయిన తరువాత కూడా దానిని అలాగే ఉంచి తరువాత సీజన్‌కు మళ్లీ సాగు చేపట్టేవారు. రెండేళ్ల నుంచి రైతులు పత్తి సాగు అయిన వెంటనే దానిని పీకేసి మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో మొక్క జొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు మండలంలో 800 ఎకరాలు, జగ్గయ్యపేట మండలంలో 2,100, వత్సవాయి మండలంలో మూడు వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగును రైతులు చేపట్టారు. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మార్కెట్‌లో ధర కూడా నిలకడగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతా హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనమే..

రైతులు హైబ్రిడ్ రకం మొక్కజొన్న విత్తనాన్ని అధికంగా సాగు చేస్తున్నారు. ఎకరానికి ఆరు కిలోల విత్తనాలు విత్తుతున్నారు. నాలుగు కిలోల సామర్థ్యం కలిగిన విత్తనాల ప్యాకెట్‌ను రకాన్ని బట్టి రూ.800 నుంచి రూ.1,600 వరకు కొనుగోలు చేస్తున్నారు. 90 రోజుల నుంచి 110 రోజుల్లో పంట చేతికొస్తుంది. విత్తనం సాగు సమయంలో ఖర్చు ఎక్కువగా ఉంటుంది. తరువాత పైరు పెరిగే కొద్దీ పెట్టుబడులు తగ్గుతాయి.

ఎరువుల వాడకం ఇలా..

ఎకరానికి నత్రజని 40 కిలోలు వాడాలి. భాస్వరం ఎకరానికి 40 కిలోలు వాడుకోవాల్సి ఉంటుంది. చివరి దుక్కుల సమయంలో ఎరువు వాడాలి. పొటాష్ ఎకరానికి 16 కిలోలు వాడాల్సి ఉంటుంది. దుక్కుల సమయంలో సగం, పంట సాగు 45 రోజుల తరువాత మరో సగం వాడాలి.

ఐదు ఎకరాల్లో సాగు చేశా



రబీ సీజన్‌లో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పత్తి అయిన వెంటనే పీకేసి మొక్కజొన్న సాగు చేపట్టా. గత ఏడాది రెండు ఎకరాల సాగుకు గాను రూ.30 వేలు పెట్టుబడి పెడితే రూ.50 వేలు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఐదు ఎకరాలకు రూ.70 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి పోను అంతా సవ్యంగా ఉంటే రెట్టింపు ఆదాయం వస్తుంది. మొక్కజొన్నకు పెట్టుబడి తక్కువ.

– దురిశాల మురళి, కౌలురైతు

మెలకువలు పాటించాలి



మొక్కజొన్న సాగు చేసిన రైతులు మెలకువలు పాటించాలి. మొదటగా విత్తన శుద్ధి చేసుకోవాలి. కలుపు నివారణ కోసం అట్రాజిన్ 500 మిల్లీలీటర్ల మందును ఎకరానికి పిచికారీ చేయాలి. నేలలోని సారవంతాన్ని బట్టి ఎరువు వాడాలి. గత రెండేళ్లుగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పంటలకు ప్రభుత్వం కూడా మంచి మద్దతు ధర ఇస్తోంది.

– కె.రామసుబ్బారెడ్డి, ఏఓ, పెనుగంచిప్రోలు మండలం

లో ఓల్టేజ్ నివారణకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆరో వార్డు కాకానినగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు తదితరులు సోమవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల కాకానినగర్‌లో పర్యటించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు స్థానికులు లో ఓల్టేజ్‌తో బాధపడుతున్నామని తమ సమస్యలు చెప్పారు. దీంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి నాలుగు నూతన స్తంభాలు ఏర్పాటుచేసి, విద్యుత్ లైన్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను నుంచి పరిశీలించిన వైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ కాకానినగర్ వాసులకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విద్యుత్ స్తంభాలు, లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇక నుంచి పరిసర ప్రాంత ప్రజలకు లో ఓల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు

సామాజిక న్యాయానికి పెద్దపీట వేసి సీఎం జగన్

పెనుగంచిప్రోలు: శాసనమండలి సభ్యుల ప్రకటనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని మైనింగ్, పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా 11 మంది బీసీలు, ఎస్సీ ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీ వర్గానికి నలుగురిని ప్రకటించటంపై సోమవారం స్థానిక సత్రం సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇంతటి గొప్ప నిర్ణయాన్ని తీసుకున్న ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. శాసనమండలిలో మొదటి సారిగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఏసురత్నానికి అవకాశం కల్పించారన్నారు. పాదయాత్రలో ఏదైతే మాట ఇచ్చారో వాటిని నెరవేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారే తప్ప వారికి ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరూ ఎల్లప్పుడూ జగనన్నకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, ఎంపీటీసీ సభ్యులు బరిగెల వెంకట్రామయ్య, బీసీ నాయకులు చేని రాంబాబు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు

అమ్మభాషలోని కమ్మదనం ఆస్వాదించాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సంస్కృతి, సంప్రదాయాలు మాతృభాషతోనే ముడిపడి ఉంటాయని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మాతృభాషా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మురళీకృష్ణ అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు వారు వారి మాతృభాష అయిన తెలుగును అభ్యసించకపోవడం దురదృష్టకరమన్నారు. మరో అతిథిగా హాజరైన బాలోత్సవ్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌పీ రామరాజు మాట్లాడుతూ తెలుగు భాషను అభ్యసించే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతుందన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న మాట్లాడుతూ తెలుగు భాషలో తియ్యదనం ఉంటుందని, విదేశాల్లో స్థిరపడిన తెలుగు కుటుంబాలకు చెందిన వారు తెలుగు భాషను నేర్చుకోవాలన్నారు. సభ అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వెన్నా వల్లభరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గుమ్మా సాంబశివరావును సత్కరించారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, రచయిత నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



వల్లభరావు, సాంబశివరావులను సత్కరిస్తున్న జనశిక్షణ సంస్థాన్ ప్రతినిధులు

వసతి గృహాన్ని సందర్శించిన న్యాయమూర్తి

మైలవరం: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత హాస్టల్ వెల్ఫేర్ అధికారులదేనని జడ్జి షేక్ షిరీన్ తెలిపారు. మైలవరంలోని డీఎన్‌టీ బాలుర వసతి గృహాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ జడ్జి షేక్ షిరీన్ సోమవారం సందర్శించారు. విద్యార్థుల నుంచి మెనూ, వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో న్యాయవాది బుద్దారపు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్జి షిరీన్ మాట్లాడుతూ భోజనం రుచిగా, శుచిగా ఉండాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ హనుమానాయక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మైలవరం డీఎన్‌టీ హాస్టల్‌లో భోజన పదార్థాలు పరిశీలిస్తున్న జడ్జి షేక్ షిరీన్

పేట ఆర్టీసీ డిపోకు రూ.6 లక్షల ఆదాయం

జగ్గయ్యపేట అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం ముక్త్యాల, కూడలి, శ్రీశైలం తదితర శైవక్షేత్రాలకు ఈ ఏడాది 34 ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా అత్యధిక ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ ఎంవీ ప్రసాద్ సోమవారం తెలిపారు. ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా రూ.6 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఇది గత సంవత్సరం ఆదాయం కంటే దాదాపుగా రూ.2.50 లక్షలు ఎక్కువ అని తెలిపారు. జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో చరిత్రలో శివరాత్రికి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయంలో ఎక్కువ అని తెలిపారు. ఈ సంవత్సరం 20 వేల మంది భక్తులను చేరవేసినట్లు పేర్కొన్నారు. మంచి ఆదాయం రావడానికి సహకరించిన డ్రైవర్లకు, కండక్టర్లకు, సూపర్‌వైజర్లకు, గ్యారేజీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభం

నందిగామ: పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను సోమవారం సాయంత్రం ఆర్డీఓ రవీంద్ర రావు ప్రారంభించారు. న్యూ ఇండియా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ తరగతులు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు మీరా హుస్సేన్, నారాయణ పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అవభృదోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శిల్పాశ్రమం వీధికి చెందిన కురిచేటి కల్యాణి 2015లో సాయినాథ్‌ను ప్రేమించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకుంది. వివాహ సమయంలో కట్నంతో పాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే కొంతకాలంగా సాయినాథ్ భార్యను అనుమానిస్తూ వేధింపులకు గురి చేయసాగాడు. భర్త వేధింపులతో పాటు అత్త పద్మావతి వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఓర్పు, సహనంతో విజయం తథ్యం

ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓర్పు.. సహనం.. సంయమనం మానవునికి ఎన్నో విజయాలను అందిస్తాయని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విద్య సమాజహితమైనప్పుడు వారు సమాజంలో ఉన్నతులుగా ఎదుగుతారని ఆయన పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో 'విద్య – నైతిక విలువలు' అంశంపై చాగంటి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య సృష్టిలోని 84 లక్షల జీవరాశుల్లో మానవునికి మాత్రమే సొంతమైన వరమన్నారు. దానిని సద్వినియోగం చేసుకొని ఉన్నతునిగా ఎదగాలన్నారు. విద్యతో మానవునికి ఘనకీర్తి లభిస్తుందన్నారు. లాల్‌బహుదూర్‌శాస్త్రి, అబ్దుల్‌కలామ్ వంటి మహనీయుల జీవితాలను వివరించే గ్రంథాలను విద్యార్థులు పఠనం చేయాలన్నారు.

కేబీఎన్ పూర్వ విద్యార్థిని నేను..

తాను విద్యార్థిగా కొన్ని దశాబ్దాల క్రితం కేబీఎన్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు హాజరై బంగారు పతకాన్ని సాధించానని గుర్తు చేసుకున్నారు. అదే వేదికపై నేడు ప్రవచనాన్ని చెప్పటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా గౌరవాతిథిగా విచ్చేసిన పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు చాగంటి దంపతులను ఘనంగా సత్కరించారు.

గృహ సారథులు.. వైఎస్సార్ సీపీ రథ సారథులు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): వైఎస్సార్ సీపీకి గృహ సారథులే రథ సారథులని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు వాటర్ ప్లాంట్ ఆవరణలో సోమవారం రాత్రి గృహ సారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ప్రతిపాదిత కుటుంబాలలో సభ్యుడిగా మెలుగుతూ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. గృహ సారథులు కూడా తమకు ప్రతిపాదించిన కుటుంబాలతో మమేకమై ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గృహసారథులు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కులమతాలు, పార్టీలు, రాజకీయాలకు తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ కోటేరు మల్లీశ్వరీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ముగిసిన సంగమేశ్వరుని కల్యాణోత్సవాలు

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన సోమవారం స్వామికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని పార్వతీ మాతకు ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం పూర్ణాహుతి, వసంతోత్సవం కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. వేద పండితుడు దాములూరి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రజ్ఞంగా ముగిశాయి. ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, దేవదాయ శాఖ తనిఖీదారు అనురాధ, ఆలయ ఈఓ భూపాల్ పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం

సంగమేశ్వర స్వామికి రూ.10.37 లక్షల ఆదాయం

నందిగామ: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని దాములూరులోని కూడలి సంగమేశ్వర స్వామి ఆలయానికి భక్తుల కానుకలు, పూజా టికెట్ల విక్రయాలు, కల్యాణ కానుకలు, బహిరంగ వేలం పాటల ద్వారా రూ.10.37 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి భూపాల్ తెలిపారు. ఆలయంలోని హుండీలను దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. ఇందులో భాగంగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.4,34,003, పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.4,61,465, కల్యాణం కానుకల ద్వారా రూ.15,415, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.96 వేలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు ద్వారా రూ.31,000 వంతున ఆదాయం లభించినట్లు తెలిపారు.



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

ముక్తేశ్వరునికి రూ.8.43 లక్షల ఆదాయం

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వర స్వామికి మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన పలు కానుకల ద్వారా రూ.8,43,372 ఆదాయం సమకూరిందని ఇన్‌చార్జ్ ఈఓ నాగరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకల లెక్కింపును సోమవారం నిర్వహించారు. ఈ లెక్కింపులో కానుకల హుండీ ద్వారా రూ. 2,76,612, దర్శనం ద్వారా రూ. 2,12,500, స్వామి వారి చదివింపులు రూ. 2,71,760తో పాటు అభిషేకాల ద్వారా రూ. 82,500 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అనూరాధ, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ముక్తేశ్వర స్వామికి విశేష పూజలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం స్వామికి విశేష పూజలు చేశారు. అర్చకులు వారణాసి సాంబశివరావు, తూమాటి లక్ష్మీ నరసింహాచార్యులు, మద్దిరాల ప్రేమ్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో పూర్ణాహుతి, పుట్నాలు దంచుట, వసంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. స్వామికి పుట్నాలు దంచే కార్యక్రమాన్ని భక్తులచే నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నాగరాజు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ పాల్గొన్నారు.



పుట్నాలు దంచే కార్యక్రమంలో భక్తులు

అమృత లింగేశ్వరునికి రూ.3 లక్షల ఆదాయం

గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర మహా క్షేత్రంలో వేంచేసియున్న అమృతలింగేశ్వర స్వామికి మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.3.09 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ నాగరాజు తెలిపారు.

కూడలిలో ఎడ్ల పూటీ లాగుడు ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సంగమేశ్వరస్వామి ఆలయ చైర్మన్, రైతు కమిటీ నాయకులు



ప్రదర్శనలో సత్తా చాటుతున్న ఎడ్లు

నందిగామ: పశు సంపద కూడా మనలో భాగమని, పశువులతో మనకు విడదీయరాని అనుబంధం ఉందని సంగమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దాములూరు కూడలిలో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి ఆలయం, రైతు కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పూటీ లాగుడు ప్రదర్శనను సోమవారం రైతు కమిటీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పశువులను కూడా కుటుంబ సభ్యులుగా భావించే ఉన్నత సంస్కృతి మనకు మాత్రమే సొంతమన్నారు. ఒకప్పుడు ప్రతి రైతు ఇంట్లో పశు సంపద ఉండేదన్నారు. మారిన కాల పరిస్థితుల నేపథ్యంలో క్రమేపీ వాటికి దూరమవుతూ వస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తిరిగి వాటి పెంపకంపై ఆసక్తి కలిగించేందుకు ఇటువంటి సంప్రదాయ పోటీలు దోహదం చేస్తాయన్నారు.

రసవత్తరంగా సాగుతున్న పోటీలు

శివరాత్రి సందర్భంగా కూడలిలో ఏర్పాటుచేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మొదటిరోజు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 21 జతల ఎడ్లు ఇందులో పాల్గొంటున్నాయి. మొత్తం రెండు రోజులపాటు పోటీలు కొనసాగుతాయి. సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు ప్రదర్శన కొనసాగింది.